నమస్తే తెలంగాణ

# రంగారెడ్డి

I హైదరాబాద్, మంగళవారం 23 జులై 2024 RANGAREDDY




అభివృద్ధి పనులపై కలెక్టర్లతో సమీక్షిస్తున్న మాణిక్‌రాజ్

## అభివృద్ధి పనులపై సీఎం కార్యదర్శి సమీక్ష

కొడంగల్, జూలై 22 : వికారాబాద్ జిల్లాలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్‌రాజ్ సమీక్ష నిర్వహించారు. ఈ మేరకు సోమవారం కొడంగల్ పట్టణంలోని కడా కార్యాలయంలో వికారాబాద్, నారాయణపేట జిల్లాల కలెక్టర్లు ప్రతీక్‌జైన్, సిక్తా పట్నాయక్‌లతో కలిసి సమావేశం నిర్వహించారు. కొడంగల్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆయన ఆరా తీశారు. నారాయణపేట అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్, వికారాబాద్, నారాయణపేట అసిస్టెంట్ కలెక్టర్లు ఉమా హారతి, గరిమ నడల, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

# ప్రతి మొక్కకూ జియో ట్యాగింగ్




**నాటిన మొక్కలను సంరక్షించేలా జిల్లా యంత్రాంగం చర్యలు**

**గుంతలు తీసే ప్రక్రియ నుంచి మొక్కలు నాటే వరకూ జియో ట్యాగింగ్**

**ఇప్పటివరకు 14.70 లక్షల మొక్కలు నాటడం పూర్తి**

**జిల్లావ్యాప్తంగా 40.48 లక్షల మొక్కలను నాటడమే లక్ష్యం**

వికారాబాద్, జూలై 22 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో వనమహోత్సవం కార్యక్రమం జోరందుకున్నది. వారం రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో మొక్కలు నాటడంలో జిల్లా యంత్రాంగం నిమగ్నమైంది. రోడ్లకు ఇరువైపులా, ప్రభుత్వ పాఠశాలలు, స్థలాల్లో మొక్కలను నాటుతున్నారు. నాటిన ప్రతి మొక్కనూ బతికించేలా అధికారులు సంరక్షణ చర్యలు తీసుకుంటున్నారు. అందుకోసం గుంతల తవ్వకం నుంచి మొక్కలు నాటే ప్రక్రియ వరకు ప్రతి మొక్కకూ జియో ట్యాగింగ్ చేస్తున్నారు. మొక్కలు నాటి నేవిగేషన్‌తో కూడిన ఫొటోలు తీయడంతోపాటు అవసరమైన వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. జియో ట్యాగింగ్‌తో నాటిన మొక్క ఏ విధంగా ఉందనేది ఎప్పటికప్పుడు తెలుసుకునే వీలుంటుంది. వనమహోత్సవంలో అన్ని శాఖల అధికారులు భాగస్వాములై ఆయా శాఖలకు నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా మొక్కలను నాటుతున్నారు.

**ఇప్పటివరకు 14.70 లక్షల మొక్కలు..**

ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా 40.48 లక్షల మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పటివరకు 14.70 లక్షల మొక్కలను నాటడం పూర్తి చేశారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో 250 మొక్కలు, ఉద్యానవన శాఖ 98 వేలు, పరిశ్రమల శాఖ 2500, అటవీ శాఖ 1.04 లక్షలు, డీఆర్‌డీఏ 12.43 లక్షలు, ఎక్సైజ్ శాఖ, వ్యవసాయ శాఖ 10 వేలు, తాండూరు మున్సిపాలిటీలో 2550, వికారాబాద్ మున్సిపాలిటీలో 1200 మొక్కలను నాటారు. ఈ ఏడాది ప్రధానంగా పండ్లు, పూల మొక్కలతోపాటు నీడనిచ్చే మొక్కలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. వనమహోత్సవంలో భాగంగా నాటుతున్న మొక్కలకు సంబంధించి జిల్లావ్యాప్తంగా 560 నర్సరీల్లో మొక్కలను పెంచారు. గతేడాది 40.49 లక్షల మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకోగా.. 38.70 లక్షల మొక్కలను నాటినట్లు అధికారులు తెలిపారు.






# మాఫీకాలె..

**రంగారెడ్డి జిల్లా డీసీసీబీ పరిధిలోనే 22వేల మందికి నో రుణమాఫీ**

**జాబితాలో కేవలం 11,700 మంది పేర్లే.. గగ్గోలు పెడుతున్న రైతాంగం**





రంగారెడ్డి, జూలై 22(నమస్తే తెలంగాణ) : రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకోవడం లేదని సీఎం రేవంత్ రెడ్డితోపాటు కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలంతా ముక్తకంఠంతో చెబుతున్నప్పటికీ.. బ్యాంకులకు వచ్చిన జాబితాలను పరిశీలిస్తే.. ప్రభుత్వం గతంలో విడుదల చేసిన మార్గదర్శకాలను అనుసరించే అర్హులను నిర్ధారించినట్లు తెలుస్తున్నది. రేషన్ కార్డులో ఉన్న సభ్యులందరినీ కలిపి ఒకే కుటుంబంగా పరిగణించడం.. పీఎం కిసాన్ నిబంధనలను రుణమాఫీకి కూడా పాటించడంతో జిల్లా రైతాంగం వాపోతున్నది. ఒక్కరి పేరుపై బాకీ ఉన్నా మాఫీ కాలేదని పలువురు రైతులు పేర్కొంటున్నారు. రంగారెడ్డి జిల్లా డీసీసీబీ పరిధిలో రూ.లక్ష లోపు రుణం తీసుకున్న రైతులు సుమారు 34వేల వరకు ఉన్నారు. అయితే ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో కేవలం 11,700 మంది రైతుల పేర్లు మాత్రమే వచ్చాయి. మిగిలిన 22 వేల మంది రైతులకు మొండిచెయ్యి చూపినట్లేనా? అన్న భావన రైతుల్లో కలుగుతున్నది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పట్టాదారు పాసుపుస్తకం ఉన్న రైతులందరికీ రూ.2లక్షలు రుణమాఫీ చేయాలని, భార్యాభర్తలిద్దరినే కుటుంబ సభ్యులుగా పరిగణించాలని, వేరుగా ఉంటున్న కుమారులకు కూడా రుణమాఫీ వర్తింపజేయాలని రైతులు కోరుతున్నారు. కొద్ది మందికే మాఫీ చేసి చేతులు దులుపుకొనే ప్రయత్నం చేయడం సరికాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఇంకా కొందరికి డబ్బులు పడలే ..**

రుణమాఫీ జాబితాలో పేర్లు వచ్చిన రైతులకు సైతం కొంతమందికి వారివారి ఖాతాల్లో మాఫీ డబ్బులు పడలేదు. రంగారెడ్డి జిల్లాలో 49,741 మంది రైతులకు రూ.278.06కోట్ల రుణమాఫీని చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఆయా జాబితాలను బ్యాంకర్లు, వ్యవసాయ అధికారులకు పంపారు. అయితే జాబితాలో పేర్లు చూసుకుని బ్యాంకులకు వెళ్లిన వారికి సైతం నిరాశే ఎదురవుతున్నది. రూ.లక్ష లోపు రుణమాఫీ ప్రక్రియ మొదలై మూడు, నాలుగు రోజులు అవుతున్నప్పటికీ రైతుల ఖాతాల్లో మాఫీ డబ్బులు జమకాకపోవడంపై బాధిత రైతులు ఆందోళనలో ఉన్నారు. ఇప్పటివరకు 48,239 మంది రైతులకు సంబంధించి రూ.250 కోట్ల మేరనే రైతుల ఖాతాల్లో జమ అయినట్లు అధికారులు చెబుతున్నారు. ఇంకా.. 1500ల మంది రైతులకు పైగా ఖాతాల్లో మాఫీ డబ్బులు జమ కావాల్సి ఉన్నది. ఇంకెప్పుడు వస్తాయని రైతులు అధికారులను ప్రశ్నిస్తున్నారు.

# వేతనాలివ్వండి మహాప్రభో..



కలెక్టరేట్ ఎదుట నినాదాలు చేస్తున్న మోడల్ స్కూళ్ల ఔట్ సోర్సింగ్ సిబ్బంది

**మోడల్ స్కూళ్ల ఔట్ సోర్సింగ్ సిబ్బందికి నెలల తరబడిగా అందని వేతనాలు**

**కలెక్టర్, జాయింట్ కలెక్టర్లకు వినతులు**

రంగారెడ్డి, జూలై 22(నమస్తే తెలంగాణ) : వచ్చేవి అరకొర వేతనాలు.. అదీ నెలల తరబడిగా రాకపోవడంతో మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి మండలంలో ఒక మోడల్ స్కూల్‌ను ఏర్పాటు చేయగా ఔట్ సోర్సింగ్‌పై జిల్లాలో సుమారుగా 64 మంది వ్యాయామ ఉపాధ్యాయులుగా, కంప్యూటర్ ఆపరేటర్లుగా, స్కూల్ సబార్డినేటర్లుగా పనిచేస్తున్నారు. వ్యాయామ ఉపాధ్యాయులకు నెలకు రూ.22,750, కంప్యూటర్ ఆపరేటర్‌కు రూ.19,500, స్కూల్ సబార్డినేటర్‌కు రూ.16 వేల చొప్పున నెలనెలా వేతనాలను చెల్లిస్తున్నారు. నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ పిల్లలకు కనీసం స్కూల్ ఫీజు చెల్లించలేక.. యూనిఫామ్, నోట్ బుక్స్ కొనలేని దుస్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విధులకు వచ్చేందుకు బస్సు చార్జీల కోసం అప్పులు చేయాల్సి వస్తున్నదని వాపోతున్నారు. ఇప్పటికైనా వేతనాలు చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నారు. ఈ మేరకు సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌కు వచ్చిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు వెంటనే వేతనాలు చెల్లించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం కలెక్టర్, అదనపు కలెక్టర్లకు తమ ఇబ్బందులు చెప్పుకొని.. వెంటనే పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాలను అందజేశారు.

**ఇల్లు గడవడం కష్టంగా ఉన్నది..**



నెలల తరబడిగా వేతనాలు రాకపోవడం వల్ల ఇల్లు గడవడం కష్టంగా ఉన్నది. పిల్లలను కూడా చదివించుకోలేని దుస్థితిలో ఉన్నాం. వేతనాలు విడుదల చేయాలన్న మా మొరను ఆలకించేవారే కరువయ్యారు. ఇప్పటికైనా మా పరిస్థితిని అర్థం చేసుకుని న్యాయం చేయాలి.

-నవనీత, మోడల్ స్కూల్ కంప్యూటర్ ఆపరేటర్

**ఇంకా టైం పడుతుందంటున్నారు**



వేతనాల విషయమై అడిగితే ఏజెన్సీ నిర్వాహకులు నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారు. ఇంకా టైం పడుతుంది. ఎప్పుడు వస్తాయో! చెప్పలేమంటున్నారు. వేతనాలు రాకపోవడానికి గల కారణం ఏమిటో తెలియడం లేదు. ఇప్పటికైనా ఉద్యోగుల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వేతనాలు విడుదల చేయాలి.

-ఆంజనేయులు, మోడల్ స్కూల్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

# కదిలారు.. తొలగించారు

**గండిపేట కాలువపై అక్రమ నిర్మాణాల తొలగింపు**

నమస్తే ఎఫెక్ట్

మణికొండ, జూలై 22: గండిపేట కాలువ(క్యాండూట్) పై అక్రమ నిర్మాణాలపై జలమండలి విజిలెన్స్ అధికారులు విచారణ కోసం కదిలారు. ఈ నెల 21న 'నమస్తే'లో ప్రచురితమైన 'వాటా ఇచ్చుకో.. వ్యాపారం చేసుకో' కథనంపై జలమండలి ఉన్నతాధికారులు స్పందించారు. కమిషనర్ ఆదేశాల మేరకు స్థానిక సెక్షన్ –17 డీజీఎం నరహరితో జలమండలి విజలెన్స్ అధికారి లక్ష్మీరెడ్డి, సురేశ్ మణికొండ, నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని గండిపేట కాలువను సందర్శించారు. క్యాండూట్‌పై వెలసిన అక్రమ నిర్మాణాలు, వ్యాపార కేంద్రాలను తక్షణమే తొలగించేందుకు యుద్ధప్రతిపాదికన చర్యలు చేపట్టారు. కాలువ శిథిలావస్థకు చేరుకోవడానికి జలమండలి సిబ్బంది వైఖరే కారణమంటూ.. స్థానికులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. పుప్పాలగూడ బీఆర్‌సీ ఎదురుగా ఓ నిర్మాణ సంస్థ నిబంధనలను తుంగలో తొక్కుతూ క్యాండూట్‌పై నిర్మించిన పైకప్పు, టైల్స్‌తో పాటు రేకులను జేసీబీల సహాయంతో తొలగించారు. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన అక్రమ నిర్మాణాలు కొన్నింటిని తొలగించామని, మిగిలిన వాటిని స్థానిక పోలీసులు, మున్సిపల్ అధికారుల సహాయంతో తొలగిస్తామని జలమండలి విజిలెన్స్ అధికారులు లక్ష్మీరెడ్డి, సురేశ్ తెలిపారు. క్యాండూట్‌పై ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపడితే..వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు.



గండిపేట కాలువపై అక్రమ నిర్మాణాల తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న విజిలెన్స్ అధికారి లక్ష్మీరెడ్డి, సురేశ్ తదితరులు

# మూసీ ఓకే.. మౌలిక వసతులు?

**గోపన్‌పల్లి వేదికగా సీఎం చేసిన వ్యాఖ్యలపై వ్యతిరేకత**

సిటీబ్యూరో, జూలై 22 (నమస్తే తెలంగాణ) : మూడు నెలల్లో లక్ష కోట్లకు పెరిగిన మూసీ సుందరీకరణ అంచనా వ్యయంపై ఇంకా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతూనే ఉన్నాయి. గోపన్‌పల్లి వేదికగా సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను నగరవాసులు, సామాజికవేత్తలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. లండన్‌లోని థేమ్స్ నది తరహాలో హైదరాబాద్‌కు జీవనది అయిన మూసీ ప్రక్షాళన చేయడం మంచిదే. కానీ ప్రజలకు మెరుగైన సౌలతులు, సౌకర్యాలను కల్పించాల్సిన ప్రాజెక్టులపై ఎందుకు సీఎం దృష్టి పెట్టడం లేదనే ప్రశ్నలు వస్తున్నాయి. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు కింద కంపు కొట్టే మూసీని గోదావరి నీళ్లతో నింపాలనే ప్రతిపాదలకు అప్పటి సీఎం కేసీఆర్ ప్రణాళికలను రూపొందించారు. ఇప్పటికే గోదావరి జలాలతో హైదరాబాద్ గొంతు తడిపేలా చేపట్టిన గోదావరి లింకేజీ గత వేసవిలో ఎంతగానో సాయపడింది. అవుటర్ రింగు రోడ్డు వెంబడి జలహారాన్ని ఏర్పాటు చేసేలా రింగ్ మెయిన్ ప్రాజెక్టును గత సీఎం కేసీఆర్ ఆచరణలోకి తీసుకొచ్చారు. ఆ నీళ్లతోనే జంట జలాశయాల దిగువన ఉండే మూసీ ద్వారా నల్గొండ వరకు మూసీ జలాలను తరలించాలనే కార్యాచరణను ఐదేండ్ల కిందట గత సీఎం కేసీఆర్ చేపట్టారు. వీటితోపాటు నగరంలో మౌలిక వసతులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చిన కేసీఆర్ సర్కార్.. హైదరాబాద్ నగరాన్ని గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని ప్రణాళికలను శాస్త్రీయంగా రూపొందించింది. గత ఆరు నెలలుగా నగర వాసుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే ఎన్నో ఫ్లైఓవర్లు, అండర్‌పాసులతోపాటు, ఎక్స్‌ప్రెస్ హైవేలు, లింకు రోడ్లు గతంలో రూపొందించిన ప్రణాళికలకే మోక్షం లేకుండా పోయింది. నగరం నలువైపులా మెట్రో విస్తరించాలనే అప్పటి ప్రభుత్వ ప్రణాళికల అలైన్‌మెంట్ మార్పులు, చేర్పులు తప్పా... ఇప్పటికీ కార్యరూపంలోకి కాంగ్రెస్ సర్కారు తీసుకురాలేకపోయింది. ఐదు నెలల కిందట గేట్ వే ఆఫ్ తెలంగాణగా పిలిచే నార్త్ హైదరాబాద్‌లోని రెండు ఎలివేటెడ్ ఫ్లై ఓవర్ల శంకుస్థాపన రోజునే మేడ్చల్ వరకు మెట్రో విస్తరించాలంటూ నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికీ ఆ ప్రతిపాదనపై ప్రభుత్వం స్పందించలేకపోయింది.



వినియోగదారుల స్పందనను తెలుసుకుంటున్న ఎండీ అశోక్‌రెడ్డి

**పరిష్కారం కాకుండానే..**

# అయినట్లు ఫీడ్‌బ్యాక్

**జలమండలి ఎండీ అసంతృప్తి**

సిటీబ్యూరో, జూలై 22 (నమస్తే తెలంగాణ ) : జలమండలి కస్టమర్ కేర్ సెంటర్ (ఎంసీసీ)ని ఎండీ అశోక్‌రెడ్డి సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. వినియోగదారుల నుంచి వస్తున్న కాల్స్, స్పందనను ఆయన పరిశీలించారు. ఇందుకోసం స్వయంగా కొందరు వినియోగదారులతో ఎండీ మాట్లాడారు. కాల్ రికార్డింగ్స్ విన్నారు. సీవరేజీ ఓవర్ ఫ్లో, రోడ్డుపై సిల్ట్, మ్యాన్‌హోల్స్, వాటర్ సరఫరాలో ప్రెజర్ ఫిర్యాదులు వచ్చాయి. సమస్య పరిష్కారమైన తర్వాత వినియోగదారులకు కచ్చితంగా సమాచారం అందించాలని ఎండీ అశోక్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. తర్వాత వినియోగదారుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. మొత్తం 5514 ఫీడ్ బ్యాక్ కాల్స్ తీసుకోగా, అందులో 3 శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేశారు. 14 శాతం మంది సమస్యను పరిష్కరించకుండానే పరిష్కారమైనట్లు ఫీడ్ బ్యాక్ ఇచ్చారు. అలాంటి వాటి విషయంలో క్షేత్రస్థాయిలో ఉన్న అధికారులు..వాటిని నేరుగా సందర్శించి, పరిష్కారమయ్యేలా చూడాలని ఆదేశించారు. వినియోగదారులకు సేవా కార్యకలాపాల్లో పారదర్శకత చూపేందుకే ఈ తనిఖీ నిర్వహించామన్నారు. జూన్‌లో 1,30,899 మంది ట్యాంకర్లు బుక్ చేసుకోగా, 1,86, 251 ట్రిప్పులు డెలివరీ చేసినట్లు అధికారులు తెలిపారు. జూన్‌లో 75, 555 ఫిర్యాదులు రాగా.. అందులో 75,496 సమస్యల్ని పరిష్కరించినట్లు చెప్పారు.

# ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్లు అరెస్ట్

సిటీబ్యూరో, జూలై 22 (నమస్తే తెలంగాణ): రాజస్థాన్ నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ రవాణా చేస్తున్న ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్లను ఎల్బీనగర్ ఎస్‌ఓటీ, జవహర్‌నగర్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేసి.. వారి నుంచి 40 కిలోల పప్పీ స్ట్రా , 10 గ్రాముల ఎండీఎంఏను స్వాధీనం చేసుకున్నారు. రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు సోమవారం కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. రాజస్థాన్‌కు చెందిన ఓమ్ రామ్ అలియాస్ ఓం ప్రకాశ్ వృత్తిరీత్యా కార్పెంటర్. గతంలో రాజస్థాన్‌లో డ్రగ్స్ కేసులో నిందితుడిగా ఉన్నాడు. అతడి స్నేహితుడైన సానవాల రామ్ హైదారాబాద్‌లోని లింగంపల్లిలో ఉంటూ రెయిలింగ్ వర్క్ చేస్తున్నాడు. వీరిద్దరికీ డ్రగ్స్ అలవాటు ఉన్నది. కాగా, మధ్యప్రదేశ్‌కు చెందిన వికాస్ అలియాస్ ముఖేశ్‌తో పరిచయం ఏర్పడింది. ఇద్దరు డ్రగ్స్‌కు అలవాటు పడడం, హైదరాబాద్‌లో మాదకద్రవ్యాల గిరాకీ ఉన్నదని గుర్తించి.. ముఖేశ్ వద్ద డ్రగ్స్ కొని హైదరాబాద్‌లో విక్రయించేందుకు ప్లాన్ చేశారు. ఇందులో భాగంగా పోలీసులకు చిక్కకుండా ఉండేలా బస్సులు, లారీలు, ఆటోల్లో ప్రయాణించి హైదరాబాద్ శివారుకు చేరుకున్నారు. ఎస్‌ఓటీ ఎల్బీనగర్ డీసీపీ మురళీధర్ నేతృత్వంలోని బృందాలకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో జవహర్‌నగర్ పోలీసులతో కలిసి వీరిపై నిఘా పెట్టి కీసర మండలంలోని తిమ్మాయిపల్లిలో గ్రామ శివారులో ఓం ప్రకాశ్, రామ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఇద్దరి నుంచి 40 కిలోల పప్పీ స్ట్రా, 10 గ్రాముల ఎండీఎంఏ, రూ. 10 వేల నగదు, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.